క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు



పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్రనామాలతో పూజలు, సాయంత్రం భక్తుల భజనలు, రాత్రి పల్లకిసేవ గావించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

నేడు పిడతాపోలూరులో ఎన్నికల ప్రచారం

ముత్తుకూరు: మండలంలోని పిడతాపోలూరు, మునునూరువారిపాళెం పంచాయతీల్లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం ఉదయం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని పార్టీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధనరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి పిడతాపోలూరు, సాయంత్రం 4 గంటల నుంచి మునునూరువారిపాళెం పంచాయతీల్లో ప్రచారం జరుగుతుందన్నారు.

ఉత్సవ ట్రాలీ బహూకరణ



ట్రాలీకి పూజలు చేస్తున్న దాతలు

మనుబోలు : సంగమేశ్వర బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే వివిధ ఉత్సవాల కోసం మనుబోలుకు చెందిన దాతలు బొమ్మిరెడ్డి పార్థేశ్వరరెడ్డి, చైతన్యరెడ్డి గురువారం శివాలయానికి ఉత్సవ ట్రాలీని బహూకరించారు. రమణమ్మ జ్ఞాపకార్థం వారి మనుమలు సుమారు రూ.1.80 లక్షలు వెచ్చించి అన్ని ఉత్సవాలకు ఉపయోగపడేలా ప్రత్యేకంగా ట్రాలీని తయారు చేయించారు.

సంగమేశ్వరునికి చప్పరోత్సవం



మనుబోలు : సంగమేశ్వర బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి చప్పరోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రధానార్చకుడు ఫణీంద్రశర్మ పార్వతి పరమేశ్వరులకు అభిషేకాలు జరిపించి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. అడుగడుగునా గ్రామస్తులు స్వామి, అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

కస్తూర్బా గాంధీకి ఘన నివాళి



కస్తూర్బా గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆశ్రమ సభ్యులు

ఇందుకూరుపేట : మండలంలోని పల్లిపాడు పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో కస్తూర్బా గాంధీ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి ఆశ్రమ కమిటీ సభ్యులు గంపల మంజుల పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం కోసం పోరాడిన మహాత్మా గాంధీకి ఆయన సతీమణి కస్తూర్బా గాంధీ విశిష్ట సేవలు అందించారన్నారు. ఆయన నడిచిన బాటలోనే ఆమె నడుస్తూ మహిళల్లో చైతన్యం నింపారన్నారు. తొలుత గాంధీజీ, స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఐక్యంగా పనిచేయాలి

కొడవలూరు: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు విజయసాయిరెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు తెలిపారు. మండలంలోని బసవాయపాళెంలో పార్టీ నాయకులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. నాయకుల మధ్య చిన్నపాటి మనస్పర్థలుంటే సర్దుబాటు చేసుకుని పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలంటే పార్టీ నాయకులంతా నెల రోజులపాటు కష్టపడి పని చేయాలని తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, నాయకులు పెల్లేటి సతీష్‌రెడ్డి, దువ్వూరు అనీల్‌రెడ్డి, సన్నారెడ్డి నందకుమార్‌రెడ్డి, ఓడూరు వెంకటేశ్వర్లురెడ్డి, వీరి సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్



వెంకటాచలం మసీదులో..

పవిత్ర రంజాన్ (ఈద్– ఉల్– ఫిత్ర్)ను ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులు, ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

వెంకటాచలం : మండల పరిధిలో రంజాన్ ఈద్‌ను గురువారం వేడుకగా చేసుకున్నారు. మండల కేంద్రమైన వెంకటాచలం, కసుమూరు, సర్వేపల్లి, ఇస్లాంపేట తదితర గ్రామాల్లోని మసీదుల్లో మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఇందులో ముస్లింలు పాల్గొని పరస్పరం రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

ఘనంగా..

ముత్తుకూరు : రంజాన్ పర్వదిన వేడుకలను మండలంలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. స్థానిక మసీదు నుంచి ఊరేగింపుగా బయలుదేరిన వందల సంఖ్యలో ముస్లింలు ఆర్‌అండ్‌బీ అతిథిగృహం సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక వద్ద ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా ముస్లిం మతపెద్ద తమ ప్రసంగంలో మహమద్ ప్రవక్త బోధనలు వినిపించారు. అలాగే, బ్రహ్మదేవి, మామిడిపూడి, పొట్టెంపాడు, పల్లెపాడుదిబ్బ, ఈపూరు గ్రామాల్లోని మసీదుల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో వందల సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

• **మనుబోలు** : మండల కేంద్రమైన మనుబోలులో రంజాన్‌ను ముస్లింలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఉపవాస దీక్షలను ముగించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న ఈద్గా మైదానంలో ముస్లింలు పెద్ద సంఖ్యలో ప్రార్థనలు చేశారు. మత గురువు రంజాన్ పండగ ప్రాశస్త్యాన్ని వివరించారు. ప్రతి ముస్లిం అల్లాహ్‌కు విధేయుడిగా ఉంటూ ఇతరుల పట్ల దయ, కరుణతో వ్యవహరించాలని ఉద్బోధించారు. ఎస్‌డీ రఫీ, షేక్.అన్సర్, జలీల్, అహ్మద్, జకీర్, అన్వర్, షఫీ, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

• **ఇందుకూరుపేట**: రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇందుకూరుపేట, కొత్తూరు, కొరుటూరు, కుడితిపాళెం, గంగపట్నం, మైపాడు తదితర గ్రామాల్లోని మసీదుల్లో మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

• **తోటపల్లిగూడూరు** : రంజాన్‌ను ముస్లింలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. నెల రోజులుగా నిష్ఠతో చేస్తున్న ఉపవాసాలు బుధవారం సాయంత్రంతో ముగిశాయి. మండలంలోని కొత్తపాళెం, సౌత్‌ఆములూరు, వరిగొండ, నరుకూరు, కోడూరు గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు ఖురాన్ చదివి దైవ సందేశం ఇచ్చారు.



ముత్తుకూరు పట్టణంలోని మసీదులో..



మనుబోలు : ఈద్గాలో..

పేదలకు సాయం చేయాలి



సందేశం ఇస్తున్న మౌలానా ఖాజీ ముస్తాక్ మదాని

పొదలకూరు : త్యాగానికి, సేవానిరతికి ప్రతీకగా నిలిచిన రంజాన్ నాడు ప్రతి ముస్లిం పేదలకు సాయం చేయాలని జామ్యా మసీదుకు చెందిన మౌలానా ఖాజీ ముస్తాక్ మదాని సందేశం ఇచ్చారు. రంజాన్ పర్వదినం సందర్భంగా పట్టణానికి సమీపంలోని ఈద్గా వద్ద ముస్లింలు గురువారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మతపెద్ద మాట్లాడుతూ ఏ మత గ్రంథాలైనా పేదలను ఆదరించవలసిందిగా సూచిస్తున్నట్లు తెలిపారు. దైవానుగ్రహానికి ఒక్కొక్కరు ఒక్కో మార్గాన్ని ఎన్నుకున్నట్లు చెప్పారు. సొంత మతాన్ని ఆదరించడంతో పాటు ఇతర మతాలను గౌరవించాలన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు హిందువులు పండగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక ప్రార్థనల్లో జిల్లా వక్ఫ్‌బోర్డు జాయింట్ సెక్రటరీ ఎస్‌కే ఖాదర్, మైనారిటీ నాయకులు, మతపెద్దలు పాల్గొన్నారు.



పొదలకూరు పట్టణంలోని ఈద్గాలో..

గ్రామగ్రామానా వైఎస్సార్‌సీపీ మార్క్ అభివృద్ధి

- అమ్మవారిపాళేనికి సాగునీరు తీసుకొస్తా
- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



అమ్మవారిపాళెం సభలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : ప్రతి గ్రామంలో సచివాలయం, ఆర్బీకే, విలేజ్ హెల్త్‌క్లినిక్ తదితర భవనాలు దర్శనమిస్తున్నాయని, ఇదే వైఎస్సార్‌సీపీ మార్క్ అభివృద్ధి అని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఉలవరపల్లి, ప్రభగిరిపట్నం, అమ్మవారిపాళెం, బత్తులపల్లి, నేదురుమల్లి, వెలికంటిపాళెం గ్రామాల్లో మంత్రి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈ విధంగా గ్రామాలు అభివృద్ధి చెందినది లేదన్నారు. సిమెంటురోడ్లు, సైడ్‌డ్రెయిన్లు, సాగునీటి కాలువలు పూర్తి చేసినట్లు తెలిపారు. అమ్మవారిపాళెం చెరువుకు దక్షిణ కాలువ నుంచి సాగునీటిని అందించి తీరుతానన్నారు. అటవీ అనుమతులు లభించడంలో కొంత జాప్యం జరిగిందని, తిరిగి ప్రభుత్వం ఏర్పడిన నెలరోజుల్లో కాలువను పూర్తి చేయించి చెరువుకు నీటిని సరఫరా చేస్తానన్నారు. ప్రభగిరిపట్నం పంచాయతీలో వైఎస్సార్‌సీపీ పటిష్ఠంగా ఉందన్నారు. నేదురుమల్లి, వెలికంటిపాళెం, బత్తులపల్లి గ్రామాల్లో పేదలకు అసైన్మెంట్ భూములను పంపిణీ చేశామన్నారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం చూపినట్లు తెలిపారు. తొలుత ఆయా గ్రామస్తులు పెద్ద ఎత్తున స్వాగతం పలికి గజమాల వేసి సన్మానించారు. మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పిల్లిపాక పెంచలప్రసాద్, గోగుల చిన్నయ్య, జ్యోతి, బత్తులపల్లి, నేదురుమల్లి, వెలికంటిపాళెం సర్పంచ్‌లు రావూరు పద్మమ్మ, ఉడతా రమేష్, పి.వెంకటరమణయ్య, ఎంపీటీసీ టి.పెంచలనాయుడు, నాగయ్య, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలిని పూలమాలతో గౌరవిస్తున్న మంత్రి కాకాణి

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి



కొడవలూరు: విశ్వజనని ఆశ్రమంలో..



వెంకటాచలం : బీసీ బాలికల వసతిగృహంలో..

పొదలకూరు : మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే భవన్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీసీ సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ స్త్రీవిద్య, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు తుమ్మల శ్రీనివాసులు, కోవూరు వెంకటేశ్వర్లు, పముజుల శంకరయ్య, సోమా భాస్కర్‌రావు, చొప్పా వెంకటేశ్వర్లు, బి.మురళీ, మాడా రాధయ్య, పి.శ్రీనివాసులు, కె.మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు : జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీసీ నేతలు

పూలే ఆశయాలను కొనసాగిద్దాం

కొడవలూరు : మహాత్మా జ్యోతిరావు పూలే దంపతులు బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం, అట్టడుగు వర్గాల విద్య కోసం జీవితాలను త్యాగం చేశారని జనతా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దాసరి ప్రసాద్ పేర్కొన్నారు. జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని మండలంలోని టపాతోపు విశ్వజనని అనాథాశ్రమంలో గురువారం పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని బాలలకు అల్పాహార విందు ఏర్పాటు చేసి స్వీట్‌లు పంచిపెట్టి మాట్లాడారు. పూలే జయంతిని ఆశ్రమంలో జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పూలే ఆశయాలకు అనుగుణంగా జనతా ఫౌండేషన్ పని చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నరసింహ, మనోజ్‌కుమార్, సుమన్, కోటి, అంకయ్య, జగన్, మురళి, జనార్దన్, పురుషోత్తం, కృష్ణ పాల్గొన్నారు.

గొలగమూడిలో..

వెంకటాచలం : మండలంలోని గొలగమూడి వద్దనున్న బీసీ బాలికల వసతిగృహంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జ్యోతిరావు పూలే జీవిత చరిత్ర గురించి ప్రిన్సిపల్ కొండల్‌రావు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



కొడవలూరు: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: మండలంలోని పెమ్మారెడ్డిపాళేనికి చెందిన వంద కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామంలో టీడీపీకి చెందిన తేళ్ల వెంకటరమణయ్య, గొల్లపూడి వెంకటేశ్వర్లు, టి.లక్ష్మీనారాయణ, సర్పంచ్ వల్లాపురం నవీన్, సీనియర్ నేత అడపాల మోహనకృష్ణ ఆధ్వర్యంలో వారి అనుచరులైన వంద కుటుంబాల టీడీపీ సానుభూతి పరులతో నెల్లూరులోని ఎమ్మెల్యే నివాసంలో ప్రసన్నకుమార్‌రెడ్డి, డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావుల సమక్షంలో గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే ప్రసన్న పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి అండగా నిలుస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులైన విజయసాయిరెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని పార్టీలో చేరిన వారు తెలిపారు.

• **ఇందుకూరుపేట** : మండలంలోని కొమరిక గ్రామంలో రాజీనామా చేసిన 15 మంది వలంటీర్లు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. నెల్లూరులోని ఎమ్మెల్యే నివాసంలో వారికి ప్రసన్నకుమార్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యేగా ప్రసన్నకుమార్‌రెడ్డిని, ఎంపీగా విజయ్‌సాయిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు.



ఇందుకూరుపేట : పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే

జగన్ మరోసారి సీఎం కావాలని..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాబోయే ఎన్నికల్లో మరోసారి విజయం సాధించి సీఎం కావాలని కాంక్షిస్తూ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కె.నారాయణరావు గురువారం మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని విధాలా రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పథకాలు అమలు కావాలన్నా వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేణుంబాక విజయసాయిరెడ్డితో పాటు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గెలవాలని పూజలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ నాయకులు హరి, రమేష్, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.



కామాక్షితాయి ఆలయ సన్నిధిలో నారాయణరావు తదితరులు

వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి



ముత్తుకూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న కాకాణి కుమార్తె పూజిత



కొడవలూరు: రామన్నపాళెంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న చలపతిరావు

ముత్తుకూరు : గడిచిన ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని, అందిన సంక్షేమాన్ని చూసి వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె కాకాణి పూజిత కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముత్తుకూరు పోలీసుస్టేషన్ రోడ్డు, పాత దళితవాడ, రాజమ్మ కాలనీ, కట్టకింద గిరిజనకాలనీ తదితర ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. ఓటర్లను స్వయంగా కలుసుకుని గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని వివరించారు. అహర్నిశలు సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధి–సంక్షేమానికి పరితపించే తన తండ్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆశీర్వదించి, మూడో సారి ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గండవరం సుగుణ, ఎంపీటీసీ సభ్యులు షేక్ నవీద్, నాయకులు లక్ష్మణరెడ్డి, గండవరం సూరి, సర్పంచ్‌లు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

విస్తృత ప్రచారాలు

కొడవలూరు: మండలంలోని రామన్నపాళెం, కొత్తవంగల్లులో వైఎస్సార్‌సీపీ నేతలు ఇంటింటి ఎన్నికల ప్రచారాలు గురువారం నిర్వహించారు. రామన్నపాళెంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. రాష్ట్రం, నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేణుంబాక విజయసాయిరెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిలను గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, నాయకులు కాకి శ్రీనివాసులు, కె.సుమన్, శ్యాంసుందర్‌రెడ్డి, పి.సాయిమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



కొడవలూరు: కొత్తవంగల్లులో ఇంటింటి ప్రచారం

కొత్తవంగల్లులో..

వైఎస్సార్‌సీపీ నేత చక్కా మనోహర్‌బాబు ఆధ్వర్యంలో కొత్తవంగల్లులో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వంద మంది పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఇంటింటికీ తిరిగి వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నంబూరి ప్రసాద్, సర్పంచ్ ఆమవరపు సింధు, సచివాలయ కన్వీనర్ వేముల వెంకటేశ్వర్లు, నాయకులు సి.శూలం హరిబాబు, వేముల రమణయ్య, కొనిజేటి శేషగిరిరావు పాల్గొన్నారు.

సభ విజయవంతానికి కృషి చేద్దాం



వైఎస్సార్‌సీపీ నాయకులతో చలపతిరావు

కొడవలూరు : ఈనెల 14న యల్లాయపాళెంలో జరిగే వైఎస్సార్‌సీపీ బహిరంగ సభ విజయవంతానికి కృషి చేద్దామని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు కోరారు. మండలంలోని యల్లాయపాళెంలో సభ ఏర్పాట్లపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాయంత్రం 4 గంటలకు గ్రామంలో జరిగే బహిరంగ సభకు వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేణుంబాక విజయసాయిరెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హాజరవుతారన్నారు. దీనికి ముందుగా గ్రామంలో భారీ ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమంలో విజయ డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తాటిపర్తి భాస్కర్, దేవిరెడ్డి సాయిరెడ్డి, ఎంపీటీసీ కేతిరెడ్డి వెంకటరమణారెడ్డి, జడ్డా జనార్దన్, ఎరగాల పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.